
వారం వారం ఓ ఉత్తమకథకు రూ. 116 బహుమతిగా అందజేస్తాం.

# సేవ - బాధ్యత



''యమలోకానికి ఇది డైరెక్టు దారి'' అని లోకులు హేళనగా కామెంట్ చేస్తుంటారు మా హాస్పిటల్ మీద. మా హాస్పిటల్ ఆవరణలో ఇటీవల నాయకులు నాటిన చెట్ల శిథిలాలు ఎండిన కొమ్మల రూపంలో దర్శనమిస్తాయి. ఒక మూలగా 'అదనపు సౌకర్యాల' కోసం మంత్రిగారు శంకుస్థాపన చేసిన శిలాఫలకం సమాధి గోడలా వుంటుంది. మా హాస్పిటల్ పెద్దదే, టౌన్లో కంతటికీ. అది ప్రభుత్వ ఆస్పత్రి అయినప్పటికీ అన్ని వసతులూ వున్నాయి కూడా.

ఇలా ఆలోచించుకుంటూ ఆపరేషన్ థియేటర్ నుండి బయటకి వచ్చాను. చిన్న అబ్బాయి 'సూది'ని మింగేశాట్ట. ఆపరేషన్ సక్సెస్సయింది. అతని తండ్రి అవినీతికి మారుపేరు, ధనవంతుడు. కానీ ఈ పట్టణంలో పేరుమోసిన సర్జన్లెవరూ లేకపోవడం చేత 'గవర్నమెంట్ ఆస్పత్రి' అయినా ఇక్కడకు తీసుకువచ్చారట.

''మా అబ్బాయిని రక్షించినందుకు మీకు జీవితాంతం ఋణపడి వుంటానండీ!'' అంటూ కొంత డబ్బు ఇవ్వబోయాడు. నేను మర్యాదగానే తిరస్కరించాను. ప్రభుత్వం నాకు జీతమిస్తోంది. రోగి రక్షింపబడ్డప్పుడు వారి తాలూకు వారి కళ్లల్లో ముత్యాల్లా మెరిసే ఆనందబాష్పాలు చాలు. నా మనసునిండా ''వృత్తికి న్యాయం చేశా''నన్న తృప్తినిస్తాయి. ఆ తృప్తితోనే బతుకు వెళ్ళ బుచ్చుతున్నాను. అలాగని నేను పెద్ద ఆదర్శవాదినని చెప్పుకోవడం లేదు.

మనం ఎంచుకున్న వృత్తి ద్వారా మనల్ని నమ్ముకున్న ఏ ఒక్కరికీ అన్యాయం చేయకూడదన్న తపన, తాపత్రయం వున్న వారిలో ఒకడ్ని మాత్రమే.

ఒక్కోసారి ఈ వైద్య వృత్తి కత్తిమీద సాములా తయారవుతుంది. రోగిని మరీ అధ్వాన్నమైన స్థితిలో హాస్పిటల్ కు తెస్తారు. ఆ సమయంలో నేను కాదు, దివి నుండి సాక్షాత్తూ ధన్వంతరి దిగివచ్చినా ఆ రోగిని రక్షించలేడేమో అనిపిస్తుంది. అలాంటి పరిస్థితులలో అతడు చనిపోతే దానికి మేమే బాధ్యులమైనట్లు మమ్మల్ని హంతకుల్లాగా చూస్తారు. డాక్టర్లు ''లైసెన్స్‌డ్ కిల్లర్లు'' అనే బిరుదును మాకప్పచెప్పి నానా దుర్భాషలాడుతూ వెళ్ళిపోతారు.

అరుణారుణ సూర్యుని ప్రభాత కిరణాలు ఇంటింటా తలుపుతట్టి ప్రవేశించి జాగరూకతను కల్గిస్తున్న ప్రాతఃకాలపువేళ అది — కాలకృత్యాలు ముగించుకుని పేపరు చూశాను. ''ఎవరో మంత్రిగారు ఆపరేషన్ నిమిత్తమై విదేశాలకు వెళ్తున్నార్ట'' ఆ ఆపరేషన్ చిన్నదే. నేను సైతం చేయగలను. ఇంకా దేశంలో నన్ను మించిన వారు ఎందరో వున్నారు. కానీ మంత్రులంతా ఏ ప్రయోజనార్థమై విదేశాలకు వెళ్తున్నారో గానీ, స్వదేశీ వైద్యాన్ని మాత్రం నమ్ముకోరు. ''నా భరతమాత... ప్రగతి... అభివృద్ధి...'' అనే నీరే అనేక వైద్య గ్రంథాలకు పుట్టినిల్లయిన ఈ భరత భూమిని, ఇక్కడి వైద్య పరిజ్ఞానాన్నీ, వైద్య కోవిదుల్ని అవమానించే విధంగా చిన్న చిన్న రోగాలకు సైతం విదేశీ టూర్లు ఫిక్స్ చేస్కుంటారు. నిజంగా నాకు బాధేసింది. నా గుండె ఆవేదనతో నిండిపోయింది.

**- కె.ఎ.మునిసురేష్ పిళ్ళై**

సైకిల్ తీసుకుని హాస్పిటల్‌కు బయలు దేరాను.

చెత్తకుండీ పక్కన ఓ అబ్బాయి పడున్నాడు, అపస్మారక స్థితిలో పడున్నాడు. మానవత 'నిండుకున్న' మనుషులందరూ చూసీ చూడనట్లుగా వెళ్ళిపోతున్నారు. అతన్ని పట్టి చూశాను. సలసల కాగే జ్వరం... టైఫాయిడ్ జ్వరం.

చెత్తకుండీలోని ఎంగిలి విస్తరాకుల్లోని మెతుకుల్ని ఏరుకుని తిని బతికే జీవితం ఆ అబ్బాయిది. అందువల్లనే... అసలు అతనికి టైఫాయిడ్ జ్వరం కూడా. నాకింకా బాధేసింది. భారత ప్రగతి పథకాలు ఏమైపోతున్నాయా అనిపించింది. 'దరిద్ర్యాన్ని నిర్మూలించే' నినాదాలు ఏమైపోయాయా అనిపించింది. భావి భారత పౌరులకు ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తోందా అన్పించింది.

ఆ అబ్బాయి కోలుకున్నాడు — నేనే ఓ జత బట్టలు కుట్టించి నాకు తెలిసిన షాపులో పనికి కుదిర్చాను. అతడిప్పుడు క్షేమంగానే వున్నాడు. కానీ అతనిలాంటి వారు ఎంతమందో దేశంలో నాకప్పుడప్పుడూ అనిపిస్తుంది. వారందరిలో కనీసం వందోవంతు మందికైనా నేను సేవ చేయగలనా! అని.

ప్రపంచ మానవాళిని ఆరోగ్యవంతం చేసే డాక్టర్లలో నేను సముద్రపు ఒడ్డున ఒక యిసుక రేణువులాంటి వాడిని మాత్రమే... శ్రమిస్తున్నాను.

నేను ఎంతమాత్రం ప్రజలకి సేవ చేశానో తెలియదు కాని ఈ ఏడు ప్రభుత్వం నాకు విశిష్ట వైద్యసేవా పతకాన్ని ప్రకటించింది. వైద్యవృత్తికే ఉన్నతమైన బహుమతి నాకు లభించిందన్న ఆనందం ఒకపక్క, ఈ బహుమతితో పెరిగిన నా బాధ్యతనీ, నేను చేయాల్సిన మరింత గురుతరమైన సేవనీ గుర్తుచేసే భయం మరోపక్క.

సన్మానసభలో — నా సన్మానానికి సమాధానంగా రోడ్డు ప్రక్కనే అనాథలు సమాధులైపోతున్న ఈ రోజులలో అలాంటి దిక్కులేని వారిని పట్టించుకోవడానికి 'సంచార హాస్పిటల్' లాంటిది ఏర్పాటు చేసి, అనాథాశ్రమాలకి, మురికివాడలకి తిరుగుతుండేలా తయారుచేయాలని నేను ప్రభుత్వాన్ని కోరాను.

నా ఆశయం నిస్వార్థమైనది. ఫలితం రెండు రోజుల్లోనే కానవచ్చింది. ఇప్పుడు నేను ప్రభుత్వం ఏర్పర్చిన ''సంచార వైద్యాలయం''లోని డాక్టర్ని. ఈ ఉద్యోగం నాకెంతో తృప్తినిస్తోంది. అమాయకులని హాస్పిటల్‌కి సైతం రాలేని వారిని పరిశీలించి, పరిరక్షిస్తున్నాననే ఆనందం నాకు మిగిలితే అదే చాలు.

ఎందరో... ముఖ్యంగా పిల్లలు, కుర్రాళ్ళు ఈ 'సంచార' విధానం వల్ల ఆరోగ్యవంతులై పోతున్నారు నాకు సంతోషం కలిగించే విధంగా.

నేనిప్పుడు డాక్టర్ని కాను, భావిభారత ఆకాశ రమ్యహర్మ్యాలకి మూలస్తంభాలు పునాదిరాళ్ళయిన బాలలని, మరింత పటిష్టంగా తయారుచేస్తున్న ఒక సామాన్య వ్యక్తిని మాత్రమే.

నే చేసింది — చేస్తున్నది — చేసేది ''సేవ'' అవునో కాదో గాని నా దృష్టిలో ''బాధ్యత'' మాత్రమే.